క్రాస్ ఓటింగ్ గుబులు

- కాపు సామాజిక తరగతి ఓటర్లపై నేతల్లో అనుమానం
- వైసిపిలో కలవరం రేపుతున్న స్థానిక సంస్థల స్వతంత్ర అభ్యర్థి పోటీ
- వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న టిడిపి

స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల విషయంలో వైసిపి నేతలకు క్రాస్ ఓటింగ్ భయం వెంటాడుతున్నట్లు కనిపిస్తోంది. ఎమ్మెల్సీ ఓటర్లుగా ఉన్న ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, కౌన్సిలర్లు సామాజిక తరగతి పేరుతో ప్రత్యర్థికి అనుకూలంగా ఓటేస్తారేమోననే సందేహం నేతల మాటల్లో వ్యక్తమవుతోంది. శ్రీకాకుళం నగరంలో మంగళవారం నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఇద్దరు, ముగ్గురు నేతల మాటలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. ఎమ్మెల్సీ గెలుపు పెద్ద కష్టం కాదంటూనే, వేరే అభ్యర్థికి ఓటేస్తే సస్పెండ్ చేస్తామంటూ తీవ్ర హెచ్చరికలు సైతం జారీ చేయడం ద్వారా వైసిపిలో నెలకొన్న క్రాస్ ఓటింగ్ భయానికి అద్దం పడుతోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి నర్తు రామారావుతో పాటు స్వతంత్ర అభ్యర్థిగా తూర్పు కాపు సామాజిక తరగతికి చెందిన ఆనెపు రామకృష్ణ పోటీ పడుతుండడం వైసిపి పెద్దలను కలవరపాటుకు గురిచేస్తోంది. బూర్జ జెడ్‌పిటిసిగా పనిచేసిన ఆయన టిడిపి నిలబెట్టిన అభ్యర్థే అన్న ప్రచారం సాగుతున్నా, కాపు సామాజిక తరగతి నుంచి పోటీ చేస్తుండడంతో నేతల్లో భయానికి కారణంగా ఉంది. కాపు సామాజిక తరగతి ఓటర్లలో కొంతమంది అటువైపు మొగ్గు చూపే అవకాశం ఉండవచ్చనే అంచనాలు నేతల్లో ఉన్నట్లు కనిపిస్తోంది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల పార్టీ ఇన్‌ఛార్జి బొత్స సత్యనారాయణ జిల్లాలో స్థానిక సంస్థల నుంచి ఎన్నికైన మొత్తం ఓటర్లు, అందులో వైసిపి ఓటర్లు ఎందరో ఉన్నారో లెక్కలు సైతం వివరించారు. ఏ నియోజకవర్గంలో ఎంత మంది వైసిపి నుంచి గెలుపొందారో ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలకు చెప్తూ ఓట్లు పెరగాలే తప్ప ఒక్క ఓటూ తక్కువ కాకూడదని హితోపదేశం చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు పెద్ద సమస్య కాదని, ఓటింగ్ విషయంలో మరో ఆలోచనకు తావివ్వొద్దంటూ చెప్పడం ద్వారా పార్టీలో కాపు సామాజిక అస్త్రం పనిచేయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లుగా కనిపిస్తోంది. రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు మరో అడుగు ముందుకేసి పార్టీ నిలబెట్టిన అభ్యర్థిని కాదని, వేరే వ్యక్తికి ఓటేస్తే వెంటనే సస్పెండ్ చేస్తామంటూ హెచ్చరికలు సైతం జారీ చేశారు. పార్టీకి వేగులు ఉన్నారని, పార్టీకి అన్ని విషయాలు ఎప్పటికప్పుడు తెలుస్తాయంటూ చెప్పడం ద్వారా వారిపై నిఘా పెడుతున్నట్లుగా కనిపిస్తోంది.



వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్న టిడిపి

ఎమ్మెల్సీ ఎన్నికల విషయంలో టిడిపి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. పార్టీ తరుపున నేరుగా అభ్యర్థిని నిలబెట్టకుండా పంచాయతీరాజ్ ఛాంబర్, తూర్పుకాపు తరుపున స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన ఆనెపు రామకృష్ణకు టిడిపి అంతర్గతంగా మద్దతు తెలుపుతోంది. వైసిపి విస్తృతస్థాయి సమావేశంలో ఇదే విషయాన్ని చెప్తూ ఇండిపెండెంట్ ముసుగులో టిడిపి తన అభ్యర్థిని నిలబెట్టిందని పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు చెప్పుకొచ్చారు. కాపు సామాజిక అస్త్రం ప్రయోగించినా, స్వతంత్ర అభ్యర్థికి టిడిపి బ్యాక్‌గ్రౌండ్ ఉండడంతో వైసిపి స్థానిక ప్రజాప్రతినిధులు పెద్దగా మొగ్గు చూపే అవకాశాలు ఉండవని గుర్తించి, వ్యూహాత్మకంగా రామకృష్ణతో టిడిపికి రాజీనామా చేయించినట్లు చర్చ నడుస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఇంకా ఎన్ని వ్యూహ ప్రతివ్యూహాలు ఉంటాయో చూడాల్సి ఉంది.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

- జిఒ 1108ను రద్దు చేయాలి
- కాకరాపల్లి థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు

ప్రజాశక్తి - నౌపడ

కాకరాపల్లి థర్మల్ పవర్‌ప్లాంట్ అనుమతుల జిఒ 1108ను రద్దు చేసి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని థర్మల్ పోరాట వ్యతిరేక కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సంతబొమ్మాళి మండలం పోతునాయుడుపేటలో కాకరాపల్లి థర్మల్ వ్యతిరేక పోరాటంలో అశువులు బాసిన అమరవీరుల సంస్మరణ సభను మంగళవారం నిర్వహించారు. అమరవీరు స్థూపం వద్ద పోలీసుల కాల్పుల్లో అమరులైన జీరు నాగేశ్వరరావు, సీరపు ఎర్రయ్య, బత్తిని బారికయ్యకు నివాళులర్పించారు. వారి ఆశయాలను కొనసాగిస్తామని ప్రతినబూనారు. 1108 జిఒ రద్దుపై రాజకీయాలకతీతంగా ప్రజాసంఘాల మద్దతుతో టెక్కలిలో త్వరలోనే రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ప్రకటించారు. ఈస్ట్‌కోస్ట్ పవర్‌ప్లాంట్‌కు ఇచ్చిన అన్ని అనుమతులను రద్దు చేసి, ఆ భూములను మత్స్యకారులకు లీజుకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులపై పెట్టిన కేసులను బేషరతుగా ఎత్తివేయాలన్నారు. సభలో థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు నంబూరు వెంకటరావు, అనంత హన్నురావు, మండల గన్ను, మండపాక నరసింగరావు, కోత మధుసూదనరావు, వైసిపి నాయకులు కోత సతీష్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పిస్తున్న ఉద్యమకారులు

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమాజంలో ఆడ, మగ అనే లింగ బేధం ఉండరాదని ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ బి.నవ్య అన్నారు. లింగ నిష్పత్తి, లింగ నిర్ధారణ (పిసిపిఎన్‌డిటి) చట్టంపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం జెసి అధ్యక్షతన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాల్లో సిసి కెమెరాలు తప్పక పనిచేసేలా పర్యవేక్షించాలన్నారు. నివేదికలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. లింగ నిర్ధారణ చట్టంపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. బాలబాలికలు ఇద్దరూ సమానమే అన్న భావన తల్లిదండ్రుల నుంచి మొదలు కావాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని కుటుంబసభ్యులకు అవగాహన కల్పించాలన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేసి బహిర్గతం చేస్తున్న స్కానింగ్ కేంద్రాలపై క్రమశిక్షణా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, ఉప వైద్యారోగ్యశాఖ అధికారి బి.అనురాధ, వైద్య నిపుణులు దానేటి శ్రీధర్, డిఐఒ ఆర్.వి.ఎస్ కుమార్, దిశ డిఎస్‌పి ఎస్.వాసుదేవరావు, అర్బన్ హెల్త్ వైద్యులు జె.కృష్ణమోహన్, ఆర్‌బిఎస్ సమన్వయకర్త సి.పి శ్రీదేవి, బెజ్జిపురం యూత్ క్లబ్ ప్రతినిధి హేమలత, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మంత్రి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

మనస్సాక్షిగా ఓటు వేయండి

- అందరి మద్దతుతోనే బరిలో నిలిచా
- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి రామకృష్ణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శాసనమండలిలో స్థానిక సంస్థల ప్రతినిధుల పక్షాన ప్రశ్నించే గొంతుక ఎవరవుతారో వారికి మనస్సాక్షిగా ఓటు వేయాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి ఆనెపు రామకృష్ణ కోరారు. నగరంలోని ఒక హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తోందని, చివరకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పంచాయతీల నిధులనూ దారిమళ్లించిందని విమర్శించారు. వాలంటీర్లకు ఉన్న గౌరవం కూడా ఎంపిటిసిలు, జెడ్‌పిటిసిలు, కౌన్సిలర్లకు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఎన్నికల బరిలో లేకుంటే స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్నట్లు స్థానిక ప్రజాప్రతినిధులకు తెలిసి ఉండేది కాదన్నారు. స్థానిక సంస్థల ఉనికిని కాపాడేందుకు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల గౌరవాన్ని నిలబెట్టేందుకే తప్పనిసరి పరిస్థితుల్లో అందరి మద్దతుతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో అన్ని పార్టీల స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల మద్దతు తనకుందన్నారు. తాను నామినేషన్ వేసేంత వరకు తెలుగుదేశం పార్టీలో కొనసాగానని, ప్రస్తుతం ఆ పార్టీకి రాజీనామా చేసి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచానని తెలిపారు. తనను ఒక పార్టీకి ఆపాదించడం సరికాదన్నారు. జిల్లాలో అత్యధిక జనాభా ఉన్న తూర్పు కాపులకు వైసిపి అన్యాయం చేసిందన్నారు. ఎమ్మెల్సీ టిక్కెట్లు ప్రకటించేంత వరకు తూర్పు కాపుల్లో ఆ పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్న పెద్దలకు అవకాశం వస్తుందని వేచి చూశామన్నారు. మాజీ ఎమ్మెల్యే మీసాల నీలకంఠం నాయుడు, డోల జగన్, మామిడి శ్రీకాంత్ వంటి నాయకుల్లో ఏ ఒక్కరి పేరు లేకపోవడంతో కలత చెందానన్నారు. తన నామినేషన్‌ను విత్‌డ్రా చేయించేందుకు అధికార పార్టీ శతవిధాలా ప్రయత్నించిందన్నారు. ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నించినా, బెదిరింపులు వచ్చినా వెనక్కి తగ్గకుండా పోటీలో కొనసాగుతున్నట్లు తెలిపారు. శాసనమండలిలో జిల్లా సమస్యలతో పాటు స్థానిక సంస్థల నిధులు, విధులు, హక్కుల కోసం ప్రశ్నించే గొంతుకకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో తూర్పుకాపు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.చంద్రమోహన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరుకట్ల విఠల్, సంతాల దిలీప్, వి.శ్యామసుందర్, ఇప్పిలి శ్రీనివాసరావు, మాధవి, డోల పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను సవాల్‌గా తీసుకోవాలి

- వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి
- వైసిపి ఓట్లన్నీ మన అభ్యర్థికి పడాల్సిందే : బొత్స
- వేరే అభ్యర్థికి వేస్తే సస్పెండ్ చేస్తాం : ధర్మాన

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఎమ్మెల్సీ ఎన్నికలను సవాల్‌గా తీసుకుని పార్టీ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి సుబ్బారెడ్డి అన్నారు. నగరంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఏ రాష్ట్రంలో లేని విధంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని, దీన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. బిసిలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందనడానికి ఎమ్మెల్సీ అభ్యర్థిగా నర్తు రామారావును ఎంపిక చేయడమే ఒక ఉదాహరణ అని చెప్పారు. ప్రతి బూత్ పరిధిలో కాంట్రాక్టు రీసోర్స్‌పర్సన్లను నియమించి ప్రతి ఓటరునూ కలవాలన్నారు.

ఒక్క ఓటూ తగ్గకూడదు

శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల పార్టీ ఇన్‌ఛార్జి, మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం 779 మంది ఓటర్లు ఉన్నారని, అందులో పార్టీ తరుపున గెలిచిన వారు 646 మంది ఉన్నారని చెప్పారు. ఒక్క ఓటు తక్కువైనా మంచి సంప్రదాయం కాదని, ఆ రకంగా ఎవరూ చేయొద్దని హితవు పలికారు. వైసిపి తరుపున 333 మంది మహిళా ప్రజాప్రతినిధులు గెలిస్తే, సమావేశానికి 36 మంది రావడం సరికాదన్నారు. ఓటర్లే సమావేశానికి రాకపోతే ఎలా అని ప్రశ్నించారు. భార్యల తరపున భర్తలు ఓటేస్తామంటే ఎవరూ ఇవ్వరని చెప్పారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జిల్లాలోని నాలుగు ప్రాంతాల్లో జరుగుతాయని, ఒక రోజు ముందే ఆయా ప్రాంతాల్లో ఓటర్లు బస చేసేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. పట్టభద్రుల ఎన్నికలకు 59 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, బూత్‌కు పది మంది చొప్పున కాంట్రాక్టు రిసోర్స్‌పర్సన్లను నియమించాలని సూచించారు. ప్రతి ఎన్నికనూ సీరియస్‌గానే తీసుకోవాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించాల్సిందేనన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వై.వి సుబ్బారెడ్డి

వేరే అభ్యర్థికి ఓటు వేసే వేటే

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ చట్ట సభల్లో యాదవ సామాజిక తరగతికి అవకాశం కల్పించడం ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రత్యేకత అని అన్నారు. ఎన్నికల్లో కాపు సామాజిక తరగతికి చెందిన ఏ ఒక్క ఓటరూ వేరే మాయలో పడొద్దని సూచించారు. పార్టీ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థిని కాదని, వేరే అభ్యర్థికి ఓటేస్తే వెంటనే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. పార్టీకి వేగులు ఉన్నారని, ఎవరు ఏం చేస్తున్నారో సమాచారం తెలియకుండా ఉండదని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలు ఏడాది తర్వాత జరగనున్న సాధారణ ఎన్నికలకు ఒక ట్రాక్ వంటిదన్నారు.

పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇండిపెండెంట్ ముసుగులో టిడిపి అభ్యర్థిని నిలబెట్టిందని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పట్టభద్రుల్లో ప్రచారం చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అంతకుముందు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పరిచయం చేశారు. సమావేశంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్యేలు గొర్లె కిరణ్‌కుమార్, కంబాల జోగులు, వి.కళావతి, రెడ్డి శాంతి, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, పాలవలస విక్రాంత్, ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి తదితరులు పాల్గొన్నారు.

చట్టసభల్లో ప్రజల గొంతు వినిపిస్తా

విస్తృతంగా పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ ప్రచారం

ప్రజాశక్తి - విజయనగరం

ఉద్యోగుల, ఉపాధ్యాయుల, నిరుద్యోగుల, పెన్షనర్ల సమస్యలను, బాధలను నేడు వినేవారే కరువయ్యారని, ఇలాంటి పరిస్థితుల్లో చట్ట సభల్లో అందరి గొంతుగా మన వాణి వినిపించాల్సిన అవసరం ఉందని ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. చట్ట సభల్లో ప్రశ్నించి, డిమాండ్లను సాధించుకునేందుకు పిడిఎఫ్ అభ్యర్థిగా తనను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం నగరంలోని విజ్జీ స్టేడియం, రాజీవ్‌గాంధీ స్టేడియంలో వాకర్స్‌ను, ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు శిక్షణ పొందుతున్న నిరుద్యోగులను కలిసి పిడిఎఫ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం పలు విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పట్టభద్రుల ఓటర్లను కలుస్తూ, నిరుద్యోగ యువతతో ర్యాలీ అవుతూ సమస్యలు తెలుసుకుని కాసేపు ముచ్చటించారు. అందర్నీ పలకరిస్తూ మద్దతు తెలపాలని కోరారు. నేడు ఉద్యోగుల సమస్యలు సిపిఎస్ రద్దు, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం మన ప్రథమ కర్తవ్యమని అన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి నిరుద్యోగులను మభ్య పెట్టారని అన్నారు. ప్రచారంలో యువత, ఉద్యోగుల నుంచి విశేష ఆదరణ లభించింది. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కె.సురేష్, వెంకటేష్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు భద్రత ఏదీ?

ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం భద్రత కల్పించాలని రమాప్రభ అన్నారు. గజపతినగరంలో ఆమె విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పర్యటించి అధ్యాపకులను, యాజమాన్యాలను కలుసుకున్నారు ప్రైవేటు విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇవ్వాలని, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని, సంక్షేమబోర్డు, సహాయ నిధిని ఏర్పాటు చేయాలని కోరారు. వారి కోసం ప్రత్యేక చట్టం చేయాలని డిమాండ్ చేశారు. వీటన్నింటినీ నెరవేర్చుకోవాలంటే శాసనమండలిలో మన గొంతు వినిపించేందుకు పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఆమె వెంట ప్రజాసంఘాల నాయకులు జి.శ్రీనివాస్, వి.లక్ష్మి, డి.రాము, ఎస్.బంగారునాయుడు, ఎన్.నాయుడు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ప్రచారం చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి రమాప్రభ

నూతన పరిశోధనలపై దృష్టి

విద్యార్థులకు నగరపాలక సంస్థ కమిషనర్ పిలుపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విద్యార్థులు నూతన పరిశోధనలపై దృష్టిసారించి శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నైపుణ్యాలు పెంపొందించుకోవాలని శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. స్థానిక హడ్కో కాలనీ మున్సిపల్ హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తిని, జిజ్ఞాసను మరింత పెంచుతాయని తెలిపారు. సైన్స్‌పై ఆసక్తి పెంచేలా బోధనలు ఉండాలన్నారు. తక్కువ ఖర్చుతో వస్తువుల ఉత్పత్తికి పరిశోధనలు చేయాలని విద్యార్థులకు సూచించారు. ఇటువంటి ప్రదర్శనల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రస్తుత రోజుల్లో రాణించేందుకు చదువుతో పాటు పలు రంగాల్లో నైపుణ్యాలు అవసరమని చెప్పారు. అనంతరం వైజ్ఞానిక ప్రదర్శనను సందర్శించి విద్యార్థులు రూపొందించిన పలు ప్రాజెక్టుల గురించి అడిగి తెలుసుకున్నారు. కరాటేలో విజయం సాధించిన పతకం అందుకున్న విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న కమిషనర్ ఓబులేసు

శ్రీచైతన్య స్కూల్‌లో...

దేశం అభివృద్ధిరంగంలోకి దూసుకుపోవడానికి విజ్ఞానశాస్త్రం దోహదపడుతోందని జిల్లా విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీచైతన్య స్కూల్‌లో సైన్స్ ఎక్స్‌పో-23 మంగళవారం నిర్వహించారు. విద్యార్థులు కొత్త విషయాలను తెలుసుకుంటూ సృజనాత్మకతను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత రసాయన శాస్త్రం లెక్చరర్ జి.వాయుకుమార్, పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.రాంప్రసాద్, రీజనల్ ఇన్‌ఛార్జి ఎస్.రామినాయుడు, శ్రీకాకుళం, విజయనగరం అకడమిక్ కో-ఆర్డినేటర్ ఎ.బాలరాజు, జోనల్ డీన్ మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్పోర్ట్స్‌మీట్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

మండలంలోని నైరలో గల వ్యవసాయ కళాశాలలో ఈనెల ఒకటి నుంచి నాలుగో తేదీ వరకు అంతర్ కళాశాలల క్రీడలు, సాంస్కృతిక, సాహిత్య మీట్‌ను నిర్వహించనున్నట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విద్యాలయ అనుబంధంగా ఉన్న 21 వ్యవసాయ పాలిటెక్నిక్, వ్యవసాయ ఇంజినీరింగ్ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు 420 మంది పాల్గొంటారని తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ పి.సాంబశివరావు, డైరెక్టర్ ఆఫ్ పాలిటెక్నిక్ ఎం.శ్రీరేఖ హాజరవుతారని తెలిపారు. విశ్వవిద్యాలయ ఫిజికల్ ఎడ్యుకేషన్ యూనివర్సిటీ అబ్జర్వర్‌గా కె.రమాకాంత్ రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

క్రీడల విభాగంలో క్రికెట్, వాలీబాల్, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థినులకు అదనంగా చెస్, క్యారమ్స్, టెన్నికాయిట్‌కు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. సాంస్కృతిక విభాగంలో పాటలు, నృత్యం, నాటిక అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సాహిత్య విభాగంలో వక్తృత్వం, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

IN THE HON'BLE COURT OF THE VI ADDL. DISTRICT JUDGE, AT: VISAKHAPATNAM
M.O.P. 735/2021

Between:
Smt. Kesana Ananta Lakshmi & 2 others ...Petitioners
And:
Sri Palikala Damodar Reddy & 2 others ...Respondents

NOTICE

To,
R-4: Smt. Palikala Punyavathi,
W/o. Late P. Damodar Reddy,
R/at Jadupudi Village,
Kaviti Mandal,
Srikakulam District.

Please take notice that the above petitioners herein has filed the above M.O.P.735/2021on the file of VI Addl. District Judge Court at Visakhapatnam against you and other respondents for claiming damages and compensation and the same was posted to **04-04-2023** for your appearance, You are hereby directed to appear in the Hon'ble Court either in person or through duly instructed Advocate on **04-04-2023** at **10:30 A.M.,** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence exparte as per law.

K. SASIBHUSHANA RAO,
Advocate
Visakhapatnam,
Cell: 9396219743.

Government of Andhra Pradesh
Endowments Department
E-PROCURMENT TENDER NOTICE

Re Construction of Temple of Sri Eswaralayam, Dusi (V), Amadalavalasa (M), Srikakulam District NIT NO.COE/607/2022-2 Dt.08.12.2022 For further details log onto website "https://tender.apeprocurment.gov.in" For further details contact Ph. 8106302267.

EXECUTIVE AUTHORITY
Sri Eswaralayam,
Dusi(V), Amadalavalasa(M)

పలాస : ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

వజ్రపుకొత్తూరు : పరిశీలిస్తున్న ఎపిసి జయప్రకాష్

కోటబొమ్మాళి : ప్రదర్శనలను పరిశీలిస్తున్న తిరుమలచైతన్య

టెక్కలి : ఆదర్శ పాఠశాలలో ప్రాజెక్టులను ప్రదర్శించిన విద్యార్థులు

ఆమదాలవలస : విద్యార్థులకు వివరిస్తున్న మోహనరావు

సైన్స్ మానవాళి ప్రగతికి దిక్సూచి

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

నౌపడ : డిజి పురంలో సైన్స్ అక్షర ఆకృతిని ప్రదర్శించిన విద్యార్థులు

ఇచ్ఛాపురం : పరిశీలిస్తున్న ఎంఇఒ అప్పారావు

లావేరు : ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి- పలాస

పలాస మదర్ థెరీసా స్కూల్‌లో చైర్మన్ వజ్జ బాబూరావు, కరస్పాండెంట్ వజ్జ గంగాభవాని, ఇన్‌ఛార్జి ప్రసాద్, గౌతమ్ స్కూల్‌లో కరస్పాండెంట్ దుర్గాశంకర్ పాత్రో, శ్రీచైతన్య స్కూల్‌లో వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. శ్రీచైతన్యలో పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రారంభించారు. విద్యార్థులతో ఏర్పాటు చేసిన ప్రయోగాత్మక సైన్స్ ప్రదర్శనలను పరిశీలించి విద్యార్థులు కనబర్చిన ప్రతిభకు అభినందించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విశాఖ ఎజిఎం సురేష్, రీజనల్ ఇన్‌ఛార్జి రామనాయుడు, కో-ఆర్డినేటర్ బాలరాజు, ప్రిన్సిపాల్ మూర్తి, డిన్ కోటి, వైస్ ప్రిన్సిపాల్ రాము, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, పలాస ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, మందస మండలం ఎంపిపి డొక్కరి దానయ్య పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని శాస్త్ర, సాంకేతిక విషయాలపై విద్యార్థి దశ నుంచే అభిరుచి పెంచుకొని శాస్త్రవేత్తల స్థాయికి ఎదగాలని జిల్లా సర్వశిక్షా అభియాన్ అదనపు పథక సంచాలకులు రోణంకి జయప్రకాష్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఉద్దానం రామకృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో కలాం సేవా సమితి ఆధ్వర్యాన నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. ఎగ్జిబిషన్ ఆసాంతం తిలకించి వివిధ ప్రాజెక్టుల వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఎగ్జిబిషన్‌కు మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 42 ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఐదో తరగతి స్థాయిలో మడియావానిపేట, మంచినీళ్లపేట, ఉద్దానం రామకృష్ణాపురం ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నారు. ప్రాథమికోన్నత స్థాయిలో నగరంపల్లి హైస్కూల్, కొమరల్తాడ పాఠశాల ప్రథమ, ద్వితీయ, ఉన్నత పాఠశాల విభాగంలో అమలపాడు, మెట్టూరు వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేతలకు షీల్డ్‌తో పాటు ప్రైజ్‌మనీ అందించారు. కార్యక్రమంలలో సర్పంచ్ చింత హేమారావు, మాజీ సర్పంచ్ చింత నారాయణ, ఎంఇఒ తులసీరావు, హెచ్‌ఎం రమేష్, ఉపాధ్యాయులు డి.అప్పారావు, లఖినాన కరుణాకర్, కలాం సేవా సమితి సభ్యులు కార్తీక్, కూర్మారావు, వెంకటేష్, శశి, హేమారావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : సైన్స్ మానవాళి ప్రగతికి దిక్సూచిగా, మార్గదర్శకత్వం చేస్తుందని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు బొడ్డేపల్లి మోహనరావు అన్నారు. జాతీయ విజ్ఞాన దినోత్సవం సందర్భంగా పట్టణంలోని లక్ష్మీనగర్ ఉన్నత పాఠశాలలో సైన్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాక్టర్ సి.వి.రామన్ పరిశోధన ఫలితాన్ని రామన్ ఎఫెక్ట్ అంటారని, ఈ ఫలితాన్ని ధ్రువపరుచుకునే దినాన్నే సైన్స్ డేగా దేశవ్యాప్తంగా నిర్వహించుకున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.విజయలక్ష్మి, జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధనరావు, బెండి నారాయణరావు, సూర్యనారాయణ, చింతాడ వెంకటరమణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

మండలంలోని కొర్లకోట జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్‌ఎం ఎం.దేవరాణి అధ్యక్షతన విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శనలు నిర్వహించారు. ప్రథమ బహుమతి పి.జగదీష్ (లీఫీ), ద్వితీయ బహుమతి కె.వి.మనోజ్ కుమార్ (హైడ్రాలిక్ జెసిబి), తృతీయ బహుమతి జి.హాసిని (రైన్ వాటర్ హార్వెస్టింగ్) కన్సోలేషన్ బహుమతి డి.ఆకాష్ వర్ధన్ (హోలోగ్రామ్)లకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.అప్పారావు, సిహెచ్.శ్రీనివాసరాజు, బి.సుధాకరరావు, బి.శ్యామలాదేవి, కె.శ్రీనివాసరావు, ఎస్.వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని డిప్యూటీ డిఇఒ తిరుమల చైతన్య అన్నారు. సైన్స్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని వంశధార ప్రయివేటు పాఠశాలను సందర్శించి, పిల్లల ప్రగతిపై ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని అభినందించారు. విద్యార్థులు ప్రదర్శించిన బిందు సేద్యం, ఎత్తిపోతల పథకం, హైడ్రాలిక్ బ్రిజ్జి, సహజ దీపం, వర్షపు నీటి సంరక్షణ తదితర ప్రదర్శనలు తిలకించి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి సి.వి.రామన్ చిత్రపటానికి పూల మాలలు వేశారు. సమావేశంలో వంశధార విద్యా సంస్థల కరస్పాడెంట్ చింతాడ అనిరుద్దుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టెక్కలి : మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో సైన్స్ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదర్శ పాఠశాల్లో ప్రిన్సిపాల్ నౌపడా సింహచలం, తలగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు ధర్మారావురావు, సైన్స్ ఉపాధ్యాయులు రాముముని రమేష్‌కుమార్, అమ్మఒడి పాఠశాలలో కరస్పాడెంట్ బరాటం శ్రీనివాసరావు, రవీంద్రభారతి పాఠశాలలో ప్రిన్సిపాల్ పద్మజ, ఒక్లాండ్ పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ మల్లా మధులత, డిగ్రీ కళాశాల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ, నరిసింగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు తిరుమలరావు ఆధ్వర్యాన విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఇందులో భాగంగా సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఇందులో భాగంగా విద్యార్థులు సైన్స్ అక్షర ఆకృతిలో కూర్చొని సైన్స్ పట్ల మక్కువను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు వీరభద్రరావు, ఆది కేశవరెడ్డి, భాస్కరరావు, లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

లావేరు : లావేరు శాఖాగ్రంథాలయంలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సి.వి.రామన్ చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాలవేసి నివాళ్లర్పించారు. 1987 నుంచి నేషనల్ సైన్స్ డేని విద్యా సంస్థల్లో నిర్వహించుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన కొన్ని ప్రయోగాలకు గ్రంథాలయం తరపున బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో లిటిల్ స్కూల్ ప్రిన్సిపాల్ బాలరాజు, గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య పాల్గొన్నారు.

నందిగాం : ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల జయపురంలో నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవంలో స్థానిక వైద్యులు పినకాన అంజలి, ప్రధానోపాధ్యాయులు డి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అంతకుముందు పాఠశాల ఆవరణలో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు.

నరసన్నపేట: స్థానిక ఎల్‌విఆర్ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎం.ప్రసాదరావు ఆధ్వర్యాన జాతీయ సైన్స్ దినోత్సవం నిర్వహించారు. ముందుగా సి.ఇ.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని స్వర్ణభారతి విద్యా సంస్థలో చైర్మన్ చాట్ల తులసీదాస్‌రెడ్డి, కో-ఆర్డినేటర్ నీలమ, జ్ఞాన భారతి విద్యా సంస్థలో కార్యదర్శి జోహార్ ఖాన్, శాంతినికేతన్ విద్యా సంస్థలో చైర్మన్ దక్కత కృష్ణమూర్తిరెడ్డి, సత్యసాయి, ఆదిత్య విద్యాసంస్థల ఆధ్వర్యాన విద్యార్థులు వివిధ రకాల సైన్స్ పరికరాలను ప్రదర్శించారు. వీటిని ఎంఇఒ అప్పారావు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రోబిన్ కుమార్‌పాడి, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం త్రినాథరావు పర్యవేక్షణలో సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు.

శ్రీకాకుళం అర్బన్ : శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశకీర్తి ప్రతిష్టలను ప్రపంచానికి చాటిచెప్పిన ఘనత సి.వి.రామన్‌కే దక్కుతుందని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు పేర్కొన్నారు. నగరంలోని కళాశాల ఆవరణలో జాతీయ సైన్స్ డే వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఫిజిక్ అధ్యాపకులు డాక్టర్ డి.శ్రావణ్‌కుమార్, అకాడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్.కృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, ఎస్.పద్మావతి పాల్గొన్నారు.

సింగుపురంలో...

యూత్‌క్లబ్ బెజ్జిపురం ఆధ్వర్యాన ఇండియా లిటరసీ ప్రాజెక్టు సహకారంతో నిర్వహిస్తున్న స్కూల్ రెడినెస్, బాలవికాస్ కార్యక్రమాన్ని శ్రీకాకుళం రూరల్ మండలంలోని సింగుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన సైన్స్ ఎక్జిబిషన్‌లో బాలవికాస్ ప్రాజెక్టు సిబ్బంది ఆరు నుంచి పదో తరగతి వరకు వివిధ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.తిరుమలాదేవి, ఉపాధ్యాయ సిబ్బంది, ప్రాజెక్టు కమ్యూనిటీ ఆర్గనైజర్ జి.హేమసుందర్ తదితరులు పాల్గొన్నారు.

కవిటి : మండల కేంద్రంలోని ఆర్ష విజ్ఞాన భారతి పాఠశాల, కళ్యాణి స్కూల్‌లో విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టను ప్రదర్శించారు. గ్రహణాలు గురించి మూత్రపిండాల పనితీరు గురించి విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మల్లేశ్వరరావు, కరస్పాండెంట్ పి.రామారావు హెచ్‌ఎం అనిల్, ఉపాధ్యాయులు శిరీష, పాపారావు, లచ్చయ్య పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఉపాధ్యాయులు

నరసన్నపేట : మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రసాదరావు

ప్రాజెక్టు ప్రదర్శలను పరిశీలిస్తున్న గీతాంజలి కరస్పాండెంట్ ఉమాదేవి

సోంపేట : మండలంలోని పలాసపురం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం హరికృష్ణ ఆధ్వర్యాన విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు తిరుపతిరావు, చక్రధర్, చాణిక్య, త్రినాథరావు, తారకేశ్వరరావు పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని మెట్టూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ముందుగా సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.మయూరిమణి, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండలంలోని బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు టి.వి.రమణమూర్తి ఆధ్వర్యాన జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా సి.వి.రామన్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు టి.లోకేశ్వరరావు, డి.ఉమాశంకర్, ఎ.వెంకటరెడ్డి పాల్గొన్నారు.

శ్రీకాకుళం : నగరంలోని గీతాంజలి స్కూల్‌లో సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థినీ విద్యార్థులు వివిధ రకాల సైన్స్ మోడల్స్‌ను ప్రదర్శించారు. ఈ ప్రదర్శలను కళాశాల కరస్పాండెంట్ సనపల ఉమాదేవి పరిశీలించారు. ఈ మేరకు అకాడమిక్ ఇన్‌ఛార్జి బొడ్డేపల్లి పద్మజ, ప్రధానోపాధ్యాయులు సింగూరు రాజు విద్యార్థులను, సైన్స్ ఉపాధ్యాయులను అభినందించారు.

లయన్స్ క్లబ్ సేవలు అమోఘం

మాట్లాడుతున్న ఉషారాజు

శ్రీకాకుళం అర్బన్ : నిరుపేదలకు సేవలందించడంలో ఇంటర్నేషనల్ స్థాయిలో లయన్స్ క్లబ్ సేవలు అమోఘం అని లయన్స్ డిస్ట్రిక్ గవర్నర్ లయన్ ఎం.ఉషారాజు అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె మంగళవారం పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగా గాంధీనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు భోజనం ప్లేట్లు, పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థులు చదువుపై దృష్టిసారిస్తే పేదరికాన్ని రూపు మాపవచ్చునన్నారు. నగర పాలక సంస్థ కమిషన్ చల్లా ఓబులేష్ మాట్లాడుతూ లయన్స్‌క్లబ్ ఓ సామాజిక సేవ సంస్థ అని అన్నారు. లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షులు కె.ఎన్.ఎస్.ఇ.ప్రసాద్ (హరికాప్రసాద్) మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. అలాగే నటుకులవారివీధిలోని లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ కార్యాలయాన్ని ఆమె సందర్శించి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. శాంతినగర్ కాలనీలోని గాంధీ స్మారక మందిరాన్ని సందర్శించారు. ముందుగా గాంధీ విగ్రహానికి మాల వేసి నివాళలర్పించారు. కార్యక్రమాల్లో డిస్ట్రిక్ క్యాబినెట్ సెక్రటరీ ఉప్పలపాటి జానకీదేవి, దాట్ల శ్రీదేవి, జోనల్ చైర్మన్ చింతాడ కృష్ణమోహన్, మాజీ అధ్యక్షులు బాడాన దేవభూషణరావు, ఉపాధ్యక్షులు-2, పొన్నాడ రవికుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వేదవతి, లక్ష్మణరావు, సెక్రెటరీ ఆర్.శ్రీనివాసరావు, చింతాడ శిరీష పాల్గొన్నారు.

'డ్రోన్' విజేతలకు అభినందనలు

టెక్కలి రూరల్: విజయవాడ విఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలో టెక్కలి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఐటి విద్యార్థులు రూపొందించిన అత్యాధునిక డ్రోన్‌ను ప్రదర్శించారని కళాశాల డైరెక్టర్, ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ పోటీల్లో కళాశాలలకు చెందిన 12 బృందాలు పాల్గొనగా ఐతమ్ విద్యార్థులు రూపొందించిన అత్యాధునిక 'సెక్యూరిటీ సెర్వైలెన్స్ డ్రోన్' పలువురి ప్రశంసలు అందుకొని ద్వితీయ బహుమతి సాధించిందని పేర్కొన్నారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో విద్యార్థులను మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐటి విభాగ అధ్యాపకులు డాక్టర్ టి.పాండురంగ విఠల్, మెకానికల్, అధ్యాపకులు డి.రఘువీర్, ఆర్.చంద్రమోహన్‌ల మార్గదర్శకత్వంలో రూపొందించారని అన్నారు. ఐటి తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు బి.జె.పి.ఎల్.రతన్, జి.సాయి సాత్విక, సిఎస్ఇ విద్యార్థులు శ్రీజనాకుమారి, గీతం పాత్రో, బి.సాయిరాజ్, పి.ఉదిత్, మెకానికల్ నుంచి ఎన్.శ్యాంవెంకట్, ఇసిఇ విద్యార్థి సిహెచ్.సుప్రజలు ఈ డ్రోను రూపొందించారని చెప్పారు. అభినందించిన వారిలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, యు.డి.ప్రసన్న, హెచ్ఒడిలు డాక్టర్ వై.రమేష్, డాక్టర్ డి.శ్రీరాములు, డాక్టర్ బి.రామారావు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

రికార్డుల పరిశీలన

మెళియాపుట్టి : మెళియాపుట్టి గ్రామ సచివాలయంలో జనసేన నాయకులు కంచరాన సాయి ప్రతాప్ సహ చట్టంలో భాగంగా మంగళవారం రికార్డులను పరిశీలించారు. ఇంటి పన్ను రసీదు బుక్కు, క్యాష్ బుక్కు, గ్రామ పంచాయతీలో నిర్వహించిన పనులకు సంబంధించి రికార్డులను, పత్రాలను, ఎం.బుక్‌ను పరిశీలించారు. కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణ బడ్డీలను తొలగించాలి

వినతిపత్రం అందజేస్తున్న రామ్మోహనరావు

ఆమదాలవలస : పురపాలక సంఘ పరిధిలోని అధికార వైసిపి నాయకుల అనుచరులు కూరగాయల మార్కెట్ వద్ద ఆక్రమించుకుని ఏర్పాటు చేసిన బడ్డీలను వెంటనే తొలగించాలని, లేనిపక్షంలో ప్రజా పోరాటం ఉధృతం చేస్తామని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు అన్నారు. జన సైనికులతో కలిసి ఆక్రమణకు గురైన కూరగాయల మార్కెట్ ముందర ఏర్పాటు చేసిన బడ్డీలను మంగళవారం పరిశీలించారు. ఎవరు అధైర్య పడవద్దు అని, జనసేన వర్తకులకు బాసటగా నిలుస్తుందని వారికి ధైర్యం చెప్పారు. అలాగే పాలబంద చెరువు వద్ద ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కె.అప్పలనాయుడుకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జన సైనికులు గణేష్, కోటి, తవిటినాయుడు, గోవింద్, రాము, రాజు, ఫణి తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేయాలి

మాట్లాడుతున్న ఎంపిడిఒ రేణుక

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో, పంచాయతీల్లో డెలప్‌మెంట్ ప్లాన్స్ తయారీలో భాగంగా సుస్థిర అభివృద్ధి సూచికలను దృష్టిలో ఉంచుకొని ప్రణాళికలు తయారు చేయాలని ఎంపిడిఒ ఎం.రేణుక, ఎపిఎం పైడి కూర్మాంలులు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో మంగళారం సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ఇరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐసిడిఎస్, హెల్త్, ఎడ్యుకేషన్, ఉమెన్ వెల్ఫేర్, న్యూట్రిషన్, శానిటేషన్, నరేగా, ఆశావర్కర్లు సమన్వయంతో పనిచేస్తే చక్కని ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. అందరికీ విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం, సామాజిక భద్రత కల్పించబడడానికి సచివాలయ సిబ్బంది అన్ని శాఖల సమన్వయంతో పనిచేయాలన్నారు. అందరికీ రక్షిత తాగునీరు అందించాలన్నారు. మురుగునీటి యాజమాన్యం పాటించాల్సిన అవసరం ఉందన్నారు. పెరటి తోటల పెంపకంపై అవగాహన కల్పించి ప్రతి కుటుంబానికీ అవసరమైన తులసి, కరివేపాకు, జామ, బొప్పాయి, మునగ వంటి ఔషధ మొక్కలను పెంచుకొనేటట్లు అవగాహన కల్పించాలన్నారు. వాటి ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు అందరి ఆరోగ్యాలు చక్కగా ఉంటాయని సూచించారు. ఐసిడిఎస్ పిఒ బాలమణి మాట్లాడుతూ గ్రామస్థాయిలో అంగనవాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు, ప్రీ స్కూల్ చిల్డ్రన్స్‌కు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని సూచించారు. తొగరాం మెడికల్ ఆఫీసర్ స్రవంతి మాట్లాడుతూ ప్రతి గర్భిణీ సకాలంలో రిజిస్ట్రేషన్ చేసి, వారికి కావాల్సిన వ్యాక్సినేషన్, ఐరన్ మాత్రలు, మెరుగైన వైద్య సౌకర్యాలు అందించేందుకు అంగనాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, ఎఎన్ఎంలు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఇఒ దుప్పల రామారావు, అక్కులపేట, దూసి మెడికల్ ఆఫీసర్లు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, సచివాలయ విద్యా సంక్షేమ సహాయకులు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

చినవంకలో ఉద్రిక్తత

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

గత నెల 24న పల్లిసారథి యువకుడిపై దాడి ఘటన చిలికి చిలికి గాలివానగా మారి మంగళవారం పల్లిసారథి గ్రామస్తులు మూకుమ్మడిగా చినవంకలోని ఆ కుటుంబం పైకి దాడికి రావడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానికులు, పోలీసులు కథనం మేరకు... చినవంకకు చెందిన సానా పాపారావుతో పాటు వారి కుటుంబ సభ్యులు పల్లిసారథికి చెందిన ఉప్పరపల్లి గణపతి తమ ఇంటి ముందు ఫోన్ మాట్లాడుతున్నాడు. ఇంటి ఎదురుగా ఫోన్ మాట్లాడడాన్ని గణపతి అభ్యంతరం చెబుతూ గత నెల 24న దాడి చేయడంతో పాటు పల్లిసారథి గ్రామాన్ని తూలనాడారు. బాధితుడు గణపతి పోలీసులను ఆశ్రయించి ఈ ఘటనపై కేసు లేకుండా బహిరంగ క్షమాపణ చెప్పాలని కోరారు. దీనిపై సాన పాపారావు ససేమిరా అనడంతో పాటు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో పల్లిసారథి గ్రామస్తులు భారీ సంఖ్యలో చినవంకలోని పాపారావు ఇంటి ఎదురుగా ఆందోళనకు దిగారు. పాపారావు కుటుంబ సభ్యులు ఇంటి నుంచి బయటకు రాకపోవడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందడంతో కాశీబుగ్గ రూరల్ సిఐ జి.శంకరరావు, ఎస్ఐ వై.మధుసూదన్ సిబ్బందితో చేరుకొని పరిస్థితిని సమీక్షించడంతో సమస్య సర్దుమణిగింది. ఈ విషయమై సిఐ స్పందిస్తూ ఇరువురు నుంచీ ఫిర్యాదులు అందాయని, దీనిపై న్యాయ సలహా తీసికొని ముందుకు వెళ్తామని చెప్పారు.

ఆందోళన చేస్తున్న పల్లిసారథి గ్రామస్తులు

నిందితులను ప్రవేశపెట్టిన డిఎస్‌పి మహేంద్ర

హత్య కేసులో నలుగురు అరెస్టు

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని వరిశాంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత జరిగిన జీరు బాలకృష్ణ హత్య కేసులో వరిశాంకు చెందిన కంబవు వెంకటరమణ, మృతుడు బాలకృష్ణ భార్య జీరు సునీత, రాము, పైడిభీమవరానికి చెందిన దుర్గాప్రసాద్‌లను అరెస్టు చేసినట్లు శ్రీకాకుళం డిఎస్‌పి మత్తె మహేంద్ర తెలిపారు. ఈ మేరకు జె.ఆర్.పురం పోలీస్ స్టేషన్‌లో మంగళవారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హత్యకు గురైన బాలకృష్ణ భార్య సునీతకు, వెంకటరమణకు రెండేళ్లుగా వివాహేతర సంబంధం ఉందన్నారు. విషయం తెలుసుకున్న మృతుడు బాలకృష్ణ తన భార్యను మందలిస్తుండేవాడని తెలిపారు. దీంతో సునీత తన భర్తను అడ్డు తొలగించుకునేందుకు నిర్ణయించిందన్నారు. ప్రియుడు వెంకటరమణతో కలిసి భర్తను హత్య చేసేందుకు పథకం రచించిందన్నారు. దీంతో ఆదివారం రాత్రి బాలకృష్ణను మందు పార్టీకి పిలిచి గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న సచివాలయం వద్ద మద్యం తాగించారని అన్నారు. అనంతరం వెంకటరమణ, స్నేహితులు రాము, దుర్గాప్రసాద్‌లు కలిసి దెబ్బలు బయటకు కనిపించకుండా గుండెపై, వీపుపై పిడుగుద్దులు గుద్ది బలవంతంగా చంపారని పేర్కొన్నారు. ఈ హత్యను సహజ మరణంగా చిత్రీకరించేందుకు గ్రామ సమీపంలోని రచ్చబండ వద్ద మృతదేహాన్ని పడేసి పరారయ్యారని చెప్పారు. అయితే స్థానిక సిఐ ఎస్.ఆదాం, ఎస్ఐ జి.రాజేష్, సిబ్బంది అనుమానితులను పట్టుకుని విచారణ చేయడంతో నిజాలు బయట పెట్టినట్టు వెల్లడించారు. ఈ నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచనట్లు తెలిపారు.

వృద్ధుడు మృతి

కొత్తూరు : మండలంలోని జోగిపాడుకు చెందిన లుకాలపు హరిముకుందరావు (64) విద్యుదాఘాతంతో మంగళవారం మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు... హరికుముందరావు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇంటి నివాసం ఉంటున్న భుక్తవల్ల చింత చెట్టు ఎక్కేందుకు కూలికి పిలిచాడు. దీంతో హరిముకుందరావు చింత చెట్టు ఎక్కి పళ్లు తీస్తుండగా... చెట్టు మధ్య ఉన్న విద్యుత్ వైర్లను తాకాడు. దీంతో విద్యుదాఘాతానికి గురై చెట్టు పైనుంచి కిందకు పడిపోడంతో ఘటనాస్థలంలోనే మృత్యువాత పడ్డాడు. మృతుడి భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు కుమారెలు, కుమార్తె ఉన్నారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

కోటబొమ్మాళి: మందస మండలం అంబుగాం నుంచి అదే గ్రామానికి చెందిన సిందిరి కాంతారావు, జలుమూరు మండలం జలుమూరుకు చెందిన కరగాన అంకయ్యతో కలిసి అక్రమంగా పశువులు తరలిస్తుండగా మంగళవారం జాతీయ రహదారి కొత్తపేట వద్ద పట్టుకుని అరెస్టు చేశామని ఎస్ఐ ఎస్.కె.మహ్మద్ అలీ తెలిపారు. వాహనాల తనిఖీలో భాగంగా వీరి వాహనాన్ని తనిఖీ చేయగా, అందులో రెండు ఆవులు, మూడు దూడలు ఉన్నాయని పేర్కొన్నారు. దీనిపై విచారించగా వీరు అంబుగాం సంతలో తక్కువ ధరకు కొనుగోలు చేసి మండలం నారాయణవలస సంతలో అధిక ధరకు విక్రయిస్తురని గుర్తించామని చెప్పారు. దీంతో వీరిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామని, పశువులను బారువ గోశాలను తరలించామని తెలిపారు.

పాల్గొన్న కౌన్సిలర్లు

ఎన్నికల కోడ్‌లో కౌన్సిల్ సమావేశం

ఇచ్ఛాపురం : ఎమ్మెల్సీ ఎన్నికలు నేపథ్యంలో ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉంది. అయినా మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి అధ్యక్షతన మంగళవారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. మీడియాకు సమచారం ఇవ్వకుండా సమావేశం నిర్వహించడం చర్చనీయాంశమైంది. మున్సిపల్ కమిషనర్ రమేష్ మాట్లాడుతూ కలెక్టర్ అనుమతితో సమావేశం నిర్వహించామని తెలిపారు. ఈ సమావేశంలో ఎజెండ అంశాలపై చర్చించామన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

విరిగిన రైల్వేగేటు

లైదాం రైల్వే గేటు ధ్వంసం

పొందూరు: రైల్వే గేటు వేసేస్తున్నారని తొందరగా దాటిపోవాలనే ట్రాక్టర్‌ను అదుపు చేయలేకపోవడంతో గేటును ఢీకొన్న సంఘటన మంగళవారం లైదాం సమీపంలో చోటుచేసుకుంది. పొందూరు-సంతకవిటి రహదారిలో లైదాం సమీపంలో రైల్వే క్రాసింగ్ వద్ద గల రైల్వే గేటును కొంచాడకు చెందిన పల్ల వాసు ట్రాక్టర్‌తో బలంగా ఢీకొనడంతో గేటు విరిగిపోయింది. ఉదయం చిప్స్ లోడుతో రాపాక నుంచి లైదాం వైపు వెళ్తుండగా రైలు వస్తుందని కాపలాదారుడు గేటు వేస్తున్నాడు. అదే సమయంలో తొందరగా గేటును దాటిపోవాలనే ఉద్దేశంతో ట్రాక్టర్‌ను వేగంగా ముందుకు తీసుకువెళ్లగా అప్పటికే గేటు పడిపోవడంతో ట్రాక్టర్‌ను అదుపుచేయలేక బలంగా ఢీకొన్నాడు. ఈ ఘనటలో గేటు పూర్తిగా ధ్వంసమైంది. ఉత్తర క్యాబిన్ వద్ద ఉన్న కాపలాదారుడు డ్రైవర్‌ను పట్టుకుని రైల్వే అధికారులకు అప్పగించాడు. ఈ సంఘటనలో ఆ రహదారిలో రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. రైలు వచ్చే సమయంలో వాహనాలను నిలుపుదల చేసేందుకు రైల్వే అధికారులు తాత్కాలికంగా గేటును ఏర్పాటు చేశారు.

అశ్రునయనాలతో ఇఒ అంత్యక్రియలు

కోటబొమ్మాళి : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోటబొమ్మాళి పంచాయతీ ఇఒ రఘుపాత్రుని యోగేశ్వరరావు అంత్యక్రియలు మంగళవారం టెక్కలిలో గ్రామస్తులు నిర్వహించారు. దీంతో కోటబొమ్మాళి, టెక్కలిల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. యోగేశ్వరరావు అధికారిగానే కాకుండా ప్రజలందరితో అందరితో స్నేహంగా ఉండేవారని గుర్తు చేసుకున్నారు. ఇఒను చివరిసారి చూసేందుకు, అంత్యక్రియల్లో పాల్గొనేందుకు పంచాయతీ ప్రజలు పెద్దఎత్తున తన స్వగృహం టెక్కలి చేరుకొని ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. యోగేశ్వరరావు మృతి కోటబొమ్మాళి పంచాయతీ ప్రజలకు తీరని లోటుని సర్పంచ్ కాళ్ల సంజీవరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు బోయిన నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ బాలకృష్ణ, సచివాలయ సిబ్బంది విచారం వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న డాక్టర్ కిషోర్

పశువులకు టీకాలు వేగవంతం

పశువైద్య సంయుక్త సంచాలకులు కిషోర్

ప్రజాశక్తి- ఆమదాలవలస

పశువులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలను వేసి సంరక్షించాలని పశు సంవర్ధక సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎం.కిషోర్ అన్నారు. పురపాలక సంఘ పరిధిలోని 15వ వార్డులో ఉన్న పాతినవారివీధి పశు వైద్య కేంద్రంలో పశు వైద్యాధికారులు, పారా వెటర్నరీ సిబ్బంది, పశు వైద్య సహాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువులకు సకాలంలో వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వ పథకాలు అమలవుతున్న తీరుతెన్నులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పశు సంవర్ధకశాఖ ద్వారా రైతులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. వివిధ రకాల వ్యాధి నిరోధక టీకాలు పశువులకు అందించాల్సిన విధానంపై సూచనలను, సలహాలను అధికారులకు, సిబ్బందికి అందించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక ఎడి డాక్టర్ ఆర్.ఆనందరావు, పశు వైద్యులు ఓంకార్, హేమలత, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేక్‌ను తినిపిస్తున్న వైద్యులు శ్వేత

దంత సంరక్షణతోనే ఆరోగ్యం

శ్రీకాకుళం అర్బన్: శరీరానికి కావాల్సిన శక్తి చక్కగా అందాలంటే.. దంతాలను ఆరోగ్యంగా ఉంచుకోవాలని సిమెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కాపవరపు సీజు అన్నారు. నగరంలోని కొన్నావీధిలో ఉన్న రాణిస్ డెంటల్, స్కిన్, హెయిర్ క్లినిక్ 3వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దంతాల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దంత వైద్యులు శ్వేత మాట్లాడుతూ దంత సమస్యలున్నా, లేకున్నా ఆరు మాసాలకోసారి విధిగా దంత వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. హరికాకనస్ట్రక్షన్స్ అధినేత కె.ఎన్.ఎస్.వి. ప్రసాద్, శోభారాణి దంపతులు, సాహ, ధనుంజయ, ఇంజినీర్ ప్రసన్న, ఇందు పాల్గొన్నారు. అనంతరం కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకుందాం

టెక్కలి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేట్ వ్యక్తుల చేతిలో పెడుతున్నాయని, ఇది హేయమైన చర్య అని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మురళి, శ్రీనివాస్‌లు అన్నారు. ఈ మేరకు మంగళవారం టెక్కలిలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి వంటి సంస్థలను కట్టబెట్టిందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమనూ అమ్మేశారని అన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు. టెక్కలి నియోజకవర్గ అధ్యక్షునిగా ఎస్.కృష్ణ, కార్యదర్శిగా కె.సంతోష్, సహాయ కార్యదర్శులుగా సందీప్, వసంత్, ఉపాధ్యక్షులు గణేష్, కార్యవర్గ సభ్యులుగా రిషి, సంతోష్, ఉమా, శేఖర్‌లను ఎన్నుకున్నామని తెలిపారు.

ఆర్థికసాయం అందజేస్తున్న గోవిందరావు

'ఎంజిఆర్' ఆర్థికసాయం

మెళియాపుట్టి : మండలంలోని దీనబంధుపురానికి చెందిన హరిపురం పున్నయ్య, జన్ని పోలయ్య, పడాల సోమయ్య, జెన్ని సుందరమ్మలకు చెందిన ఇల్లు, రెండు పశువుల శాలలు, పవర్ ట్రైలర్ అగ్ని ప్రమాదంలో కాలిపోయాయి. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, సామాజిక వేత్త మామిడి గోవిందరావు మంగళవారం బాధిత కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు బియ్యం, నిత్యవసర వస్తువులు, రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. అలాగే లింగుపురానికి చెందిన మజ్జి ఫాల్గుణరావుకు రెండు కాళ్లు పనిచేయకపోవడంతో ఆయననూ పరామర్శించి రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, అంపోలు పోలినాయుడు, మామిడి గంగాధర్, ఎ.దశరథ, పోతురాజు శ్రీధర్, పి.కూర్మారావు, కె.రామస్వామి పాల్గొన్నారు.

నేటి నుంచి ఎల్‌సిడిసి సర్వే

జలుమూరు : ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలోని పట్టణ ప్రాంతాలైన శ్రీకాకుళం టౌన్, ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురాల్లో మార్చి ఒకటి నుంచి ఎల్‌సిడిసి క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామని డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాన సురేష్ కుమార్ తెలిపారు. జలుమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తిలారు రైల్వే స్టేషన్ కాలనీ మంగళారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ, పట్టణ ప్రాంతాల్లో దాగి ఉన్న కొత్త లెప్రసీ కేసులను గుర్తించడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది పనిచేయాలని అన్నారు. రావిపాడు సచివాలయం సిబ్బంది జగదీశ్వరి, వెంకటరావు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ డే

నందిగాం : టైలర్స్ డే సందర్భంగా ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి టైలర్స్ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా టైలర్ల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుని ఆర్థికసాయం అందజేస్తున్నారని అన్నారు. అనంతరం సిఎం చిత్రపటానికి టైలర్లు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, ఎంపిటిసి అంబోడీ విష్ణు, టైలర్ల సంఘం ప్రతినిధులు కొత్తపల్లి మోహనరావు, పాత్రు దుర్యోధనసిద్ధి గోపి, సాహుకారి కృష్ణారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

కొత్తూరు : ర్యాలీ నిర్వహిస్తున్న టైలర్లు

కోటబొమ్మాళి: టైలర్ల డే సందర్భంగా మండల కేంద్రంలో టైలర్లు ర్యాలీ నిర్వహించారు. కరోనా సమయంతో మృతి చెందిన టైలర్ల కుటుంబ సభ్యులను ఆదుకోవాలని కోరారు.

బూర్జ : మండల కేంద్రంలోని టైలర్స్ డేను నిర్వహించారు. అనంతరం సంఘ మండల అధ్యక్షులుగా కొరికెన రామ్‌రాజు, ఉపాధ్యక్షులుగా రాము, సెక్రటరీలుగా గోవిందరావు, పొందూరు తవుడులను ఎన్నుకున్నారు. అనంతరం వారికి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో తోట్టడి సురేష్, ఎంపిటిసి చొక్కర పోలినాయుడు, ఎంపిటిసి మాజీ సభ్యులు వ్యాపార వెంకటప్పరావు పాల్గొన్నారు.

కొత్తూరు : టైలర్స్ దినోత్సవం సందర్భంగా మెట్టూరులోని టైలర్ల యూనియన్ ఆధ్వర్యాన పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు విలియమ్స్ హోవే చిత్రపటానికి పులమాల వేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో మెట్టూరు సర్పంచ్ మొజ్జాడ రుక్మిణి, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు యర్లంకి కొండలరావు, పప్పు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

పలాస : మండలంలోని బ్రాహ్మణతర్లలో టైలర్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో దర్జీలు కలిసి కట్టుగా కుట్టుమిషన్లకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గుణితి అప్పారావు, అవిష్ టైలర్, పడాల కాలి తదితరులు పాల్గొన్నారు.

నందిగాం : జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపిపి శ్రీరామ్మూర్తి

జామి ఎల్లమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి- పలాస

పలాసలోని జామి ఎల్లమ్మ జాతర అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేశారు. ఏటా మృగశిర నక్షత్రంలో ప్రారంభమయ్యే ఈ అమ్మవారి మహోత్సవం రోజంతా యాత్రికులకు కనువిందు చేస్తుంది. ప్రతి మహాశివరాత్రి రోజున అమ్మవారి పెట్టెను దించి 11 రోజులపాటు పరిసర గ్రామాల్లో తిప్పడం ఇక్కడి సాంప్రదాయం. అనాది కాలంగా తల్లాకోట జమీందారులు జామీ ఎల్లమ్మ ఆలనా పాలన చూడాలని కొల్లకోట కుటుంబీకులకు అప్పగించారు. అయితే ఈ యాత్రకు లక్షలాది మంది యాత్రికులు ఏటా వస్తుంటారు. వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా మున్సిపల్ కమిషనర్ రాజగోపాలరావు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాసరావు, ఆలయ కమిటీ ఆధ్వర్యాన ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేస్తున్నారు. తాగునీటి సౌకర్యం, వైద్య సదుపాయం వంటివి సేవలు అందుబాటులో ఉంటాయని వారు తెలిపారు. కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం ఆధ్వర్యాన యాత్రికులకు ఉచిత అన్నదానం ఏర్పాటు చేస్తున్నామని ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి మల్లా కృష్ణారావు, తంగుడు వైకుంఠరావు, పి.వి.సతీష్, పిసిఎం అధ్యక్షులు మల్లా సురేష్, పెద్దలు మల్ల భాస్కరరావు తెలిపారు.

ఎల్లమ్మ జాతర ఆలయం

గురుకులంలో యువ టూరిజం క్లబ్ ఏర్పాటు

మాట్లాడుతున్న గీతాశ్రీకాంత్

శ్రీకాకుళం అర్బన్ : కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ ఆదేశాలను అనుసరించి జిల్లా వ్యాప్తంగా పర్యాటకశాఖ యువ టూరిజం క్లబ్‌ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని టూరిజం కౌన్సిల్ సభ్యులు గీతాశ్రీకాంత్ తెలిపారు. నగర శివారుల్లో ఉన్న పెద్దపాడు గురుకులంలో పర్యాటకశాఖ ఆధ్వర్యాన యువ టూరిజం క్లబ్‌ను మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్లబ్‌లు జిల్లాలోని పర్యాటక ప్రదేశాల గురించి మరింత ప్రచారం చేయడంలో యువకులు భాగస్వాములు కావాలన్నారు. క్లబ్ సభ్యులకు జిల్లాలోని పర్యాటక ప్రదేశాలపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన శిక్షణ అందిస్తామని తెలిపారు. పర్యాటక అధికారి నారాయణరావు మాట్లాడుతూ తర్ఫీదు పొందిన క్లబ్ సభ్యులకు తదుపరి టూరిజం ద్వారా ఉపాధి పొందే అవకాశమూ ఉందని పేర్కొన్నారు. ఇలాంటి ప్రతిష్టాత్మక కార్యక్రమానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యాన మంత్రిత్వశాఖ శ్రీకారం చుట్టిందన్నారు. కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

క్విజ్ పోటీలో 'ఆదర్శ' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి- పొందూరు

విజయవాడలో సైన్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలో పొందూరు ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానాన్ని సాధించారు. రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఆదర్శ పాఠశాలకు చెందిన ప్రాజెక్టు ఎంపికైన విషయం పాఠకులకు విదితమే. ఈ పోటీలకు ఎంపికైన ప్రాజెక్టులకు సంబంధించిన పాఠశాల విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు తమ సత్తాను చాటి ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు నిర్వాహకులు ప్రశంసాపత్రాలను అందజేశారు. దీంతో విద్యార్థులకు ప్రిన్సిపాల్ ప్రభాకర్, ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

ప్రశంసాపత్రాలను అందుకుంటున్న విద్యార్థులు

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న వెంకటశివసాయి

బూర్జ: మండలంలోని ఎ.పి.పేట శ్మశానవాటికకు వెళ్లే సిసి రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ కోరికాన వెంకట శివసాయి మంగళవారం శంకుస్థాపన చేశారు. శ్మశానానికి వెళ్లేందుకు రోడ్డు లేకపోవడంతో మృతదేహాలను పంట పొలాల్లోనుంచి గ్రామస్తులు తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకుంది. వర్షాలు కురిస్తే మరింత దారుణంగా ఉంటుంది. దీంతో పాలకులు స్పందించి 14వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.40 లక్షలు వెచ్చించి సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దేవాడ శ్రీనివాసరావు, సీతారామరాజు, సీపాన సుదర్శనరావు, మాజీ సర్పంచ్ రామ్మూర్తి, ఏనుగుతల సింహాచలం, దుర్గారావు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

ఉగాది సాహితీ పురస్కారాలకు

దరఖాస్తుల స్వీకరణ

రణస్థలం : మూడేళ్లుగా ముద్రితమైన పద్య, వచన కవితా సంపుటాలకు పోటీ నిమిత్తం దరఖాస్తులకు ఆహ్వానం పలుకుతున్నట్లు మహ్మద్ రఫీ (ఈవేమన) ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశోభకృత నామ ఉగాది కార్యక్రమం ఈ నెల 19న శ్రీకాకుళం కేంద్ర గ్రంథాలయంలో సభ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ మూడేళ్లలో ముద్రించిన పుస్తకాలు మాత్రమే అర్హత గలవని అన్నారు. కవితా సంపుటులు మార్చి 10లోగా పంపాలని కోరారు. పది తరువాత అందిన పుస్తకాలు పోటీకి అనర్హమన్నారు. రచనలు పంపాల్సిన చిరునామా మహ్మద్ రఫీ (ఈవేమన), శారదా అపార్ట్‌మెంట్ ఎస్-1, లక్ష్మీనగర్, రణస్థలం, శ్రీకాకుళం జిల్లా, పిన్ కోడ్- 532407కు పంపాలన్నారు. మరిన్ని వివరాలకు 7893451307 సెల్ నంబరును సంప్రదించాలని కోరారు. ఇందులో గెలుపొందిన వారికి ప్రథమ రూ.3 వేలు, ద్వితీయ రూ.2 వేలు, తృతీయ బహుమతులు రూ.వెయ్యి అందజేస్తామని ప్రకటించారు. ఈ నగదు పురస్కారం రణస్థలం మండల కేంద్రానికి చెందిన మేమున్నాం సేవా సంఘం అధ్యక్షులు పి.సాయిరామ్ అందజేయనున్నట్లు తెలిపారు.

తనిఖీలు చేస్తున్న పోలీసులు

ముమ్మర తనిఖీలు

టెక్కలి రూరల్: మేజర్ పంచాయతీ పరిధిలోని కంద్రవీధిలో మంగళవారం వేకువజామున టెక్కలి పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ ఎల్.రామకృష్ణ ఆధ్వర్యాన సిబ్బంది ఆకస్మికంగా సెర్చ్ నిర్వహించారు. సుమారు రెండు గంటలపాటు పోలీసులు విస్తృత తనిఖీలు చేప్టారు. 120 ఇళ్లను, 42 వాహనాల ధ్రువీకరణపత్రాలను పరిశీలించినట్లు ఎస్ఐ తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా ఈ ప్రాంతంలో నివాసముంటున్నారా? పత్రాలు లేని వాహనాలు ఏమైనా ఉన్నాయా? అన్న కోణంలో పోలీసులు తనిఖీలు చేశారు.

సుబ్బారెడ్డిని కలిసిన ఆదిరెడ్డి

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీలోని 20 వార్డు కౌన్సిలర్ తాడి ఆదిరెడ్డికి ఇటీవల వైసిపి జిల్లా ప్రచార కమిటీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు అప్పగించారు. మంగళవారం జిల్లా కేంద్రానికి వైసిపి రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి వచ్చారు. విషయం తెలుసుకున్న ఆదిరెడ్డి జిల్లా కేంద్రానికి వచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు. వైసిపి అభివృద్ధికి కృషి చేయాలని సుబ్బారెడ్డి సూచించారు. అనంతరం దుశ్శాలువ కప్పి సన్మానించారు. అలాగే మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, డాక్టర్ సీదిరి అప్పలరాజు, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్‌లు అభినందనలు తెలిపారు.

సన్మానిస్తున్న సుబ్బారెడ్డి

పరిసరాలను పరిశీలిస్తున్న మాధవరావు

ప్రణాళికతోనే ఉత్తమ ఫలితాలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగినట్లయితే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని బిసి సంక్షేమశాఖ పాఠశాలల రాష్ట్ర ఉప కార్యదర్శి పి.మాధవరావు అన్నారు. మండలంలోని అక్కుపల్లి మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి పాఠ్యాంశాల అవగాహనను పరీక్షించారు. రానున్న పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. విద్యార్థులు పరీక్షలంటే ఆందోళన, ఒత్తిడికి గురి కాకుండా ఏకాగ్రత తో చదివి మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. మెనూ అమలుపై విద్యార్థులను అడిగి ఆరా తీశారు. అనంతరం పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. వసతిగృహం పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ జె.లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ ఎం.పాపారావు పాల్గొన్నారు.

పట్టాను స్వీకరిస్తున్న ఉమామహేశ్వరరావు

ఉమామహేశ్వరరావు సేవలకు గుర్తింపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

స్వచ్ఛంద సేవకుడు, శిష్టకరణం సంఘానికి రాష్ట్ర అధ్యక్షులు పోలుమహంతి ఉమామహేశ్వరరావుకు జెసిఐ సంస్థ నుంచి గ్రాడ్యుయేషన్ పట్టా అందుకున్నారు. ఇటీవల నెల్లూరులో నిర్వహించిన ఇన్ స్టలేషన్ కార్యక్రమంలో భాగంగా నేషనల్ చైర్మన్ ప్రమోద్ కుమార్ చేతుల మీదుగా ఈ పట్టాను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 36 ఏళ్లుగా జెసిఐలో సేవలందించిన తనకు గతంలో అంతర్జాతీయ కమలపత్ర అవార్డు లభించిందన్నారు. తనసేవలను గుర్తించి గ్రాడ్యుయేషన్ పట్టాను ప్రదానం చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. జెసిఐని బలోపేతం చేసేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. అలాగే ఎస్ఎంఎ జెసిఐ సీనియర్ మెంబర్ అసోసియేషన్ లోకల్ చాప్టర్‌కు అండగా నిలుస్తానని చెప్పారు. ఉమామహేశ్వరరావుకు డాక్టర్ వినీల బాయ్ పట్నాయక్. డాక్టర్ జెమ్మీనియర్, ఫిజియోథెరపిస్టు డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్ పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఆర్‌డిఓ సీతారామ్మూర్తి

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురంలో ఏర్పాటు చేసిన రెండు ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను ఆర్‌డిఓ సీతారామ్మూర్తి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఏడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇందులో ఇచ్ఛాపురంలో రెండు, కవిటిలో రెండు, సోంపేటలో రెండు, కంచిలిలో ఒకటి పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈయన వెంట తహశీల్దార్ గురుప్రసాద్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆడపిల్లలను చదివిద్దాం

పోలాకి: ఆడపిల్లను రక్షించి చదివించుకుందామని పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి శ్రీనాథ్ పిలుపునిచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని 14 సచివాలయాల పరిధిలో ఆడ పిల్లలు రక్షణ అవగాహనా ర్యాలీ మంగళవారం నిర్వహించారు. పోలాకి పురవీధుల్లో వైద్యారోగ్యశాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు బేటి బచావో బేటి పడావో అంటూ నినాదాలు చేస్తూ చేశారు. ఆరోగ్య విస్తరణ అధికారి డాక్టర్ నల్లి రవికుమార్ మాట్లాడుతూ బాలికల సంక్షేమానికి, వారి చదువుల కోసం ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నాయని అన్నారు. ఈశ్వరమ్మ, పిహెచ్ఎన్ రత్నం, సరిత, జ్యోత్స్న, బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి, అధ్యాపక సిబ్బంది, ఆశా కార్యకర్తలు సూరీడు, సాయిలక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది